డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎస్పీ అశోక్‌కుమార్, ఇతర అధికారులతో కలిసి మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సామగ్రిని సరి చూసుకుంటున్న అధికారులు

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా వ్యాప్తంగా 71 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- కలెక్టర్ బీ సత్యప్రసాద్

జగిత్యాల, ఫిబ్రవరి 26: జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ బీ సత్యప్రసాద్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో ఎమ్మెల్సీ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్, ఏర్పాట్లను బుధవారం ఆయన ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి పర్యవేక్షించారు. అలాగే, రూట్ వారీగా బస్సులను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 71 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 35,280 మంది పట్టభద్రులు, 1769 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. 12 సెక్టర్లలో ప్రతి రూట్‌లో బ్యాలెట్ బాక్స్‌లు డిస్ట్రిబ్యూషన్ చేసినట్లు చెప్పారు. ఓటర్లు పోల్ చీటితో పాటు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించిన గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రతతో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ, పటిష్ఠ బందోబస్తు మధ్య బ్యాలెట్ బాక్స్‌లను పోలింగ్ కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా రూట్ మొబైల్స్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారులు, ఆర్డీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న సిబ్బంది

సారంగాపూర్: భక్తులతో కిటకిటలాడుతున్న దుబ్బ రాజన్న ఆలయం

ధర్మపురి: అక్కపెల్లి రాజేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

భక్తిశ్రద్ధలతో శివరాత్రి వేడుకలు

- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
- ఆలయాల్లో పూజలు చేసిన భక్తులు

జగిత్యాల/ధర్మపురి/మెట్‌పల్లి/ కోరుట్ల/ సారంగాపూర్/కథలాపూర్/మల్లాపూర్/ కోరుట్ల రూరల్/ జగిత్యాలరూరల్/ మేడిపల్లి/ రాయికల్/గొల్లపల్లి/కొడిమ్యాల/ఇబ్రహీంపట్నం/ మారుతీనగర్/వెల్గటూర్, ఫిబ్రవరి 26: మహ శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా శైవాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. అత్యంత భక్తిశ్రద్ధలతో భక్తులు హరహర మహదేవ.. శంభో శంకర.. అంటూ గరళకంఠుడైన శివుడిని ఆరాధించారు. జగిత్యాలలోని పలు ఆలయాల్లో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతాసురేశ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీశ్ దంపతులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ శీలం ప్రియాంక-ప్రవీణ్, నాయకులు ఆనందరావు, వెంకటేశ్వరరావు, పురుషోత్తం రావు, నీలి ప్రతాప్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి-లక్ష్మణ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ధర్మపురిలోని గోదావరి నదిలో భక్తులు స్నానాలాచరించారు. అనంతరం నృసింహ ఆలయంతో పాటు రామలింగేశ్వరాలయం, అక్కపెల్లి రాజేశ్వరాలయంలో భక్తులు పూజలు చేశారు. ధర్మపురిలో ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు. అక్కపెల్లి రాజేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించగా, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, డీసీఎమ్మెస్ చైర్మన్ డా.ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు హాజరయ్యారు. రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని పలు ఆలయాల్లో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత-సురేశ్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ భోగ శ్రావణి దంపతులు, బీఆర్ఎస్ నాయకులు మల్లేశ్, అనిల్, శ్రీధర్‌రెడ్డి, ఉదయశ్రీ, రాణి, ప్యాక్స్ చైర్మన్లు రాజలింగం యాదవ్, మల్లారెడ్డి, రత్నాకర్ రావు, మహేశ్ గౌడ్, తదితరులు పూజలు చేశారు. మల్లాపూర్‌లోని కనక సోమేశ్వరాలయంలో మెట్‌పల్లి, ఖానాపూర్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తులు అరుణ్‌కుమార్, జితిన్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. జాతరలో బందోబస్తు, ఆలయ పరిసర ప్రాంతాలను సీఐ నిరంజన్ రెడ్డి పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇక్కడ ఎస్ఐ రాజు, ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగరాజం, సభ్యులు, తదితరులున్నారు. పెగడపల్లిలోని స్వయంభూ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించి, కోడె మొక్కు చెల్లించుకున్నారు. వెల్గటూర్‌లోని కోటిలింగాలలో భక్తులు గోదావరిలో స్నానాలాచరించి, కోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అలాగే, స్వామి వారిని విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉమాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. గొల్లపల్లి మండలంలోని రాపల్లిలో స్వామి వారి జాతర ఉత్సవాల్లో భాగంగా ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించారు. సారంగాపూర్ మండలం పెంబట్ల-కోనాపూర్‌లోని దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి దంపతులు, జగిత్యాల జిల్లా జడ్జి ఎస్ నారాయణ స్వామి, అధికారులు, ప్రజాప్రతినిధులు స్వామి వారిని దర్శించుకొని, పూజలు చేశారు. ఎస్పీ అశోక్ ఆధ్వర్యంలో డీఎస్పీ రఘుచందర్, జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ దత్తాద్రితో పాటు ఆయా స్టేషన్ల ఎస్ఐలు, పోలీసులు భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. బీర్‌పూర్ మండలంలోని ఆలయాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు.

జగిత్యాల: అభయాంజనేయ స్వామి ఆలయంలో శివుడికి అభిషేకం చేస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత దంపతులు, భక్తులు

ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో సంఘం సభ్యులు

జిల్లా అధ్యక్షుడిగా షేక్ కరీం

కొడిమ్యాల, ఫిబ్రవరి 26: మండల కేంద్రంలో తుర్కకాశీ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని తుర్కాశీనగర్‌కు చెందిన షేక్ కరీం, ఉపాధ్యక్షుడిగా రాయికల్ మండలానికి చెందిన షేక్ ఇమామ్, సహాయ కార్యదర్శిగా జగిత్యాల రూరల్ మండలానికి చెందిన షేక్ గోరే మియా ఎన్నికయ్యారు. మిగతా కార్యవర్గాన్ని త్వరలోనే ప్రకటించనున్నట్లు చెప్పారు.

మానవత్వం చాటుకున్న హెడ్ కానిస్టేబుల్

సారంగాపూర్, ఫిబ్రవరి 26: పెంబట్ల-కోనాపూర్‌లోని దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయంలో బుధవారం మహాశివరాత్రి సందర్భంగా విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రాజు మానవత్వాన్ని చాటుకున్నాడు. దుబ్బ రాజన్న జాతరకు వచ్చిన ఓ దివ్యాంగుడు దైవ దర్శనం చేసుకోవడానికి ఇబ్బందులు పడ్డాడు. దివ్యాంగుడు నడవలేని స్థితిలో ఉండడంతో గమనించిన హెడ్ కానిస్టేబుల్ రాజు అతని దగ్గరకు వెళ్లి తన భుజాలపై ఎత్తుకొని ఆలయంలోకి తీసుకెళ్లి దైవ దర్శనం చేయించాడు.

దివ్యాంగుడికి దర్శనం చేయించి బయటకు తీసుకువస్తున్న హెడ్ కానిస్టేబుల్ రాజు

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

మాట్లాడుతున్న ఎస్ఈ సాలియా నాయక్

సారంగాపూర్, ఫిబ్రవరి 26: పెంబట్లలోని దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బహ్మోత్సవాల్లో నిరంతరం విద్యుత్ అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎస్ఈ సాలియా నాయక్ తెలిపారు. జాతరలో విద్యుత్ సరఫరా ఏర్పాట్లను బుధవారం పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

వీరభద్ర శతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

పుస్తకావిష్కరణ

కథలాపూర్, ఫిబ్రవరి 26: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు పులికాంత విద్యాసాగరయ్య రాసిన శ్రీ వీరభద్ర శతకం పుస్తకాన్ని స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఆవిష్కరించారు. అలాగే, వీరభద్రస్వామి ఆలయంలో పూజలు చేశారు. రచయిత విద్యాసాగరయ్యను గ్రామస్తులు శాలువాలతో సన్మానించారు. యువజన సంఘం సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

‘విజయవంతం చేయాలి’

ధర్మారం, ఫిబ్రవరి 26: బీసీ ఆజాదీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తలపెట్టిన ‘పల్లెబాట’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కోరారు. ఈ మేరకు బుధవారం కరీంనగర్ ఆయన స్వగృహంలో పల్లెబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ, గ్రామ గ్రామాన బీసీల చైతన్యం, ఐక్యత కోసం పల్లెబాట నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. జనాభాలో బీసీల వాటాపై జరుగుతున్న పల్లెబాట కార్యక్రమం బీసీలను కదిలించడానికి ఎంతో ఉపయోగపడుతుందని, బీసీలు, ప్రజా సంఘాలు, అంబేద్కర్ వాదులు, యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బీసీ ఆజాదీ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ మాట్లాడుతూ, జనాభాలో సగభాగమైన బీసీలు బీసీల హక్కుల సాధన అభివృద్ధి కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి బీసీ భాగస్వామ్యమవుతున్నారని, ప్రతి పల్లెను కదిలించడమే లక్ష్యంగా పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ కరీంనగర్ జిల్లా కన్వీనర్ చిలుక మారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 26: పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం కొత్తూరు మల్లయ్య అధ్యక్షతన బుధవారం పట్టణంలోని సీఐటీయూ హమాలీ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించకుంటే దశలవారీగా పోరాటాలకు సన్నద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో రెండు నుంచి ఐదు నెలల వరకు పంచాయతీ కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్ రావు, ఎలుకపెల్లి సారయ్య, మహంకాళి కొమురయ్య, కాశిపాక శంకర్, వడ్లూరి లక్ష్మీనారాయణ, మొలుగూరి ప్రేమ్ కుమార్, గంధసిరి సంపత్, సమ్మయ్య, చంద్రయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలి

- ఎస్పీ అశోక్‌కుమార్
- పోలీస్ అధికారులు, సిబ్బందికి విధులపై అవగాహన

మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల, ఫిబ్రవరి 26: జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎన్నికల విధులపై బుధవారం ఆయన పోలీసు అధికారులు, సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధులు ఏ విధంగా చేపట్టాలి, నియమనిబంధనల గురించి ఎస్పీ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికల విధులు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. సిబ్బంది కేటాయించిన పోలింగ్ కేంద్రాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలి వెళ్లరాదన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చిన వారితో మర్యాదపూర్వకంగా ఉండాలని, అనవసర విషయాలు చర్చించవద్దన్నారు. పోలింగ్ జరుగుతున్న సమయంలో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగే ఏ చిన్న ఘటన ఎదురైనా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఓటర్లు సెల్ ఫోన్లు, ఇంక్, వాటర్ బాటిళ్లు పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్లవద్దని, సెల్ఫీలు దిగడం నిషేధమన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఉన్నతాధికారుల అనుమతి లేకుంటే విధుల నుంచి వెళ్లరాదన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన నియమాలను పక్కాగా అమలు చేస్తామన్నారు. అవాంఛనీయ ఘటనలు జరుగడానికి ఆస్కారం ఉంటే వెంటనే సంబంధిత ఎస్‌హెచ్‌వో, రూట్ మొబైల్ అధికారికి సమాచారం అందించాలన్నారు. జిల్లాలోని 71 పోలింగ్ కేంద్రాల్లో 233 మంది పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. పటిష్టమైన ఎస్కార్ట్‌తో పోలింగ్ సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించడం జరుగుతుందన్నారు. 12 రూట్లల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని, ఇద్దరు డీఎస్పీలతో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ , 6 సీఐలతో స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు, ఎస్ఐలతో 18 పెట్రోలింగ్ బృందాలను కేటాయించినట్లు పేర్కొన్నారు. అడిషనల్ ఎస్పీ భీంరావు, డీఎస్పీలు రఘుచందర్, రాములు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఆరీఫ్ అలీఖాన్, సీఐలు వేణుగోపాల్, రవి, రాంనరసింహారెడ్డి, సురేశ్, రవి, ఆర్ఐలు వేణు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

మెట్‌పల్లి, ఫిబ్రవరి 26: కోరుట్ల నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. నియోజకవర్గంలో 8710 పట్టభద్రుల ఓటర్లు ఉండగా 5460 మంది పురుషులు, 3250 మంది మహిళలు ఉన్నారు. ఉపాధ్యాయ ఓటర్లు 597 ఉండగా, 446 మంది పురుషులు, 151 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కోరుట్లతో పాటు మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్‌లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కోరుట్ల, మెట్‌పల్లిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో పట్టణ, మండల ఓటర్లు, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్‌లో మండల కేంద్రంతో పాటు మండలానికి చెందిన ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. బ్యాలెట్ పద్ధతిలో నిర్వహిస్తున్న పోలింగ్ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగునున్నది. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ యంత్రాంగం పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లు చేపట్టింది. ఇప్పటికే ఎస్పీ అశోక్‌కుమార్ పలు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు.

మెట్‌పల్లి: మల్లాపూర్‌లోని పోలింగ్ కేంద్రంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్డీవో శ్రీనివాస్

కథలాపూర్, ఫిబ్రవరి 26: మండలంలో పట్టభద్రుల ఓటర్లు 863 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 23 మంది ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

పెగడపల్లి, ఫిబ్రవరి 26: మండలంలో పట్టభద్రుల ఓటర్లు 1602 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 36 మంది ఉన్నట్లు తహసీల్దార్ రవీందర్ తెలిపారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

సారంగాపూర్, ఫిబ్రవరి 26: సారంగాపూర్, బీర్‌పూర్ మండల కేంద్రాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది బుధవారం సాయంత్రం చేరుకున్నారు. ఆయా కేంద్రాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల ఇన్‌చార్జి తహసీల్దార్ ముంతాజొద్దీన్ తెలిపారు. సారంగాపూర్ మండలంలో ఉపాధ్యాయ ఓటర్లు 11, పట్టభద్రులు 528 మంది ఓటర్లు, బీర్‌పూర్ మండలంలో ఉపాధ్యాయ ఓటర్లు 25, పట్టభద్రులు 595 మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

దుకాణాల నిర్వహణకు రేపు వేలం పాట

మల్యాల(కొడిమ్యాల), ఫిబ్రవరి 26: కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో దుకాణాల నిర్వహణకు ఈనెల 28న సీల్డ్ టెండర్లు, బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరి కాయలు అమ్ముకునే హక్కు కోసం ధరావతు సొమ్ము రూ. 30 లక్షలు, సెక్యూరిటీ డిపాజిట్ రూ. 2 లక్షలు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునే హక్కు కోసం ధరావతు సొమ్ము రూ. 10 లక్షలు, సెక్యూరిటీ డిపాజిట్ రూ. 2 లక్షలు, పూలు, పండ్లు అమ్ముకునే హక్కు కోసం ధరావతు సొమ్ము రూ. 5 లక్షలు, సెక్యూరిటీ డిపాజిట్ రూ. లక్ష, గాజులు, ప్లాస్టిక్ వస్తువులు అమ్ముకునే హక్కు కోసం ధరావతు సొమ్ము రూ. 5 లక్షలు, సెక్యూరిటీ డిపాజిట్ లక్షా, పుట్నాలు, ప్యాలాలు అమ్ముకునే హక్కు కోసం ధరావతు సొమ్ము రూ. 5 లక్షలు, సెక్యూరిటీ డిపాజిట్ రూ. లక్ష, హోటల్ నిర్వహణ హక్కు కోసం ధరావతు సొమ్ము రూ. 4 లక్షలు, సెక్యూరిటీ డిపాజిట్ రూ. 50 వేలు, ఫొటో స్టూడియో నిర్వహణ హక్కు కోసం ధరావతు సొమ్ము రూ. 4 లక్షలు, సెక్యూరిటీ డిపాజిట్ రూ. 50 వేలు, సామగ్రి భద్రపరిచే హక్కు కోసం ధరావతు సొమ్ము రూ. 4 లక్షలు, సెక్యూరిటీ డిపాజిట్ రూ. 50 వేలు, స్నానపు గదులు, మరుగుదొడ్ల నిర్వహణ హక్కు కోసం ధరావతు సొమ్ము రూ. 4 లక్షలు, సెక్యూరిటీ డిపాజిట్ రూ. 50 వేలు, కిరాణా దుకాణం నిర్వహణకు ధరావతు సొమ్ము రూ. 5 లక్షలు, సెక్యూరిటీ డిపాజిట్ రూ. లక్ష, శీతల పానీయాలు, ఐస్‌క్రీం అమ్ముకునే హక్కు కోసం ధరావతు సొమ్ము రూ. 5 లక్షలు, సెక్యూరిటీ డిపాజిట్ రూ. లక్ష, పాదరక్షలు భద్రపరిచే హక్కు కోసం ధరావతు సొమ్ము రూ. 3 లక్షలు, సెక్యూరిటీ డిపాజిట్ రూ. 50 వేలు, వంట చెరుకు అమ్ముకునే హక్కు కోసం ధరావతు సొమ్ము రూ. 50 వేలు, సెక్యూరిటీ డిపాజిట్ రూ. 20 వేలు చెల్లించాలన్నారు. దుకాణాలు దక్కించుకున్న వారు ఏప్రిల్ 1, 2025 నుంచి మార్చి 31, 2026 వరకు నిర్వహించుకునే హక్కు ఉంటుందన్నారు.

దుబ్బ రాజన్న జాతరలో భక్తుల నిలువు దోపిడీ

సారంగాపూర్, ఫిబ్రవరి 26: పెబంట్లలోని దుబ్బ రాజన్న క్షేత్రంలో జాతర ఉత్సవాల్లో భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఆలయం ఎదుట, కోనేరు వద్ద ఏర్పాటు చేసిన దుకాణాల్లో కొబ్బరికాయలు, బెల్లం అధిక ధరకు విక్రయిస్తున్నారు. కొబ్బరికాయ రూ. 50, బెల్లం కిలో రూ. 100కు విక్రయించారు. విషయం తెలుసుకున్న ఆలయ మాజీ ధర్మకర్తలు కోండ్ర రాంచందర్ రెడ్డి, వాసం శ్రీనివాస్, కొలపాక రవి, చిందం శ్రీనివాస్, పిట్టల చిన్నగంగారాం కొబ్బకాయల దుకాణానికి వెళ్లి అధిక ధరకు ఎందుకు అమ్ముతున్నారని ప్రశ్నించారు.? ఈవోకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా ఆలయ అధికారులు ఎవరూ రాలేదు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే సంజయ్‌కి స్వామి వారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- మహదేవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కోరుట్ల, ఫిబ్రవరి 26: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. పట్టణంలోని మహదేవస్వామి ఆలయంలో బుధవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో కొలువుదీరిన శివలింగానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి, స్వామి వారి ప్రసాదం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఇక్కడ ఆలయ కమిటీ అధ్యక్షుడు నరేశ్, అర్చకుడు పాలెపు భరద్వాజ శర్మ, బీఆర్ఎస్ నాయకులు దారిశెట్టి రాజేశ్, మారు సాయిరెడ్డి, గెల్లె శ్రీనివాస్, గంగాధర్, ఫహీం, పొట్ట సురేందర్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

రాయికల్: పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

కోరుట్ల/రాయికల్, ఫిబ్రవరి 26: కోరుట్ల, రాయికల్ పట్టణాల్లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను బుధవారం కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సామగ్రిని తనిఖీ చేశారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించాలని, ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్, రెవెన్యూ అధికారులకు సూచించారు. ఇక్కడ కోరుట్ల ఆర్డీవో జివాకర్‌రెడ్డి, తహసీల్దార్లు కిషన్, ఎండీ ఖయ్యూం, ఎస్ఐలు శ్రీకాంత్, శంకర్, తదితరులున్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కోరుట్ల, ఫిబ్రవరి 26: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ సురేశ్ బాబు సూచించారు. పట్టణంలోని కేరళ హైస్కూల్‌లో బుధవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ, విద్యార్థులు సెల్‌ఫోన్లు, మత్తు పదార్థాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు కనిపెడుతూ ఉండాలన్నారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, ఆత్మ విశ్వాసంతో చదివి పరీక్షలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎస్ఐ శ్రీకాంత్, డాక్టర్ రమేశ్, ఆయా కళాశాలల కరస్పాండెంట్లు ప్రవీణ్‌కుమార్, అంజయ్య, మొయిజ్, ఆర్ఐ మహ్మద్, పాఠశాల కరస్పాండెంట్ మహ్మద్ అబ్దుల్ బారీ, ప్రిన్సిపాల్ సెలీనా బారీ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 26: మండలంలోని చిన్న మెట్‌పల్లి గ్రామానికి చెందిన మోత్కూరి సంజయ్ (19) బుధవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కల్లూరు మోడల్ స్కూల్‌లో సంజయ్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇంటర్ మొదటి సంవత్సరంలో కొన్ని పేపర్లు తప్పాడు. ద్వితీయ సంవత్సరం సబ్జెక్ట్‌లు పాస్ అవుతానో లేదో అనే భయంతో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు వచ్చి చూసే సరికి మృతిచెంది ఉన్నాడు. సంజయ్ తల్లి లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.